క్లుప్తంగా

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ.19.9 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సేవకులు

కంచరపాలెం : జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు గురువారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. 61 రోజులకు గాను అమ్మవారి ముడుపులు, ప్రత్యేక దర్శనాలకు సంబంధించి రూ.19,09,971 వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. సహాయ కమిషనర్, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి. వసంతకుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏపీజీవీ బ్యాంక్, కంచరపాలెం పోలీస్ సిబ్బంది, కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ ఉద్యోగులు, శ్రీవారి స్వచ్ఛంద సేవకులు తదితరులు లెక్కింపులో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీహోమం

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు సత్యం జంక్షన్ దరి గాంధీనగర్‌లో శ్రీ వరసిద్ధి వినాయక పూజా మహోత్సవాల్లో భాగంగా అయోధ్య రామాలయం సెట్‌లో గణపతి భక్తులను ఆకట్టుకుంటున్నారు. ఈ మండపంలో శ్రీ లక్ష్మీ గణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం లక్ష్మీ హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై భక్తిశ్రద్ధలతో హోమం నిర్వహించారు. 16 రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తామని, ఈ నెల 18న భారీ అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోన ఆనంద్, ఆర్.సాయికృష్ణ, సాగర్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తాటిచెట్లపాలెం : అక్కయ్యపాలెం పరిధిలో హైటెన్షన్ లైన్ల కింద నిర్వహణ పనుల్లో భాగంగా చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్ – 1 ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. అక్కయ్యపాలెం, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, నారాయణ స్కూల్, బాబా గుడి ప్రాంతం, నరసింహనగర్, ఆకాష్ జూనియర్ కాలేజీ, నరసింహనగర్ రైతుబజార్ ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ప్రతిభా పురస్కారాల ప్రదానం రేపు

మురళీనగర్ : మురళీనగర్, మాధవధార వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు శనివారం ప్రదానం చేయనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాశల సూర్యనారాయణ, వెన్నెల సూర్యనారాయణ, కోశాధికారి పాడుపిరెడ్డి సన్యాశిరావు ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన వారిలో ఎంపిక చేసిన 20 మంది వెలమ సామాజికవర్గ విద్యార్థులకు నగదు పురస్కారంతోపాటు జ్ఞాపిక, సర్టిఫికెట్ అందిస్తామన్నారు. ఆ రోజు వర్మా కాంప్లెక్సు సమీపంలోని ఆహ్వానం ఫంక్షన్ హాలులో సాయంత్రం నిర్వహించే కార్యక్రమానికి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు హాజరుకావాలని కోరారు.

సర్వర్ గదిలో షార్ట్ సర్క్యూట్

మర్రిపాలెం : కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల సర్వర్ గదిలో స్వల్పంగా ప్రమాదం చోటు చేసుకుంది. ఈ మేరకు సర్వర్ రూమ్‌లో ఉన్న కంప్యూటర్ సీపీయూ నుంచి గురువారం రాత్రి పొగ రావడంతో ఒక్కసారిగా సిబ్బంది అప్రమత్తమయ్యారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. తక్షణమే ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది పొగను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా పొగ వ్యాప్తి చెందినట్టు తెలిపారు.

కొండవాలులో ఒరిగిన స్తంభాలు

- ఎప్పుడేం జరుగుతుందోనని భయాందోళనలు
- రాత్రి వేళ విద్యుత్ కోతలతో అవస్థలు
- ప్రభుత్వంపై మండిపడుతున్న 45వ వార్డు కొండవాలు నివాసులు





వరాహగిరికాలనీలో ప్రమాదకరంగా పక్కకు ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలు

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 45వ వార్డు కొండవాలు ప్రాంతం సత్యసాయినగర్, సింహగిరికాలనీ, వరాహగిరి కాలనీలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఒరిగిపోవడంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని స్థానిక నివాసులు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఒరిగిన స్తంభాల పక్కన నివాసాలున్న వారికి కంటి మీద కునుకు ఉండడం లేదు. ఇటీవల చిన్నపాటి గాలులకే ఈ ప్రాంతంలో స్తంభాలు ఊగిపోయాయని, పడిపోతాయేమోనని భయంతో గడుపుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ సమస్యపై తెలియజేస్తున్నా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. తుఫాన్లు, ప్రకృతి వైపరీత్యాలు, వేగంగా గాలులు వీచినా ఊహించని నష్టం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల విద్యుత్ వైర్లను తాకుతూ చెట్లు విస్తరించాయని... పొరపాటున ఆ చెట్లను ముట్టుకున్నా విద్యుత్ ప్రవహించి షాక్ కొట్టే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. అదేవిధంగా పోల్స్ మీదకు వ్యాపించిన చెట్ల కొమ్మలు కొన్ని సార్లు గాలులు వీచే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లను తాకడంతో షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

అప్రకటిత కరెంట్ కోతలతో అవస్థలు

విద్యుత్ స్తంభాలు, ఇళ్లకు ఇచ్చిన కనెక్షన్ల పరిస్థితి అధ్వానంగా తయారవడంతో భయపడుతూ బతుకుతున్న కొండవాలు ప్రాంతాల వాసులు ఇష్టారాజ్యంగా విద్యుత్ కోతలతో మరింత ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు రాత్రివేళ కంటి మీద కునుకు లేకుండా పోతోందని, విద్యుత్ సరఫరా ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో... అసలు రాత్రంతా వస్తుందో రాదో తెలియడం లేదని కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత పది రోజుల్లో రెండు రాత్రులు విద్యుత్ లేకుండా గడిపామని అంటున్నారు వరాహగిరికాలనీ వాసులు. రాత్రి 9, 10 గంటలకు కరెంటు పోతే తెల్లవారుజామున 2, 3 గంటల వరకు రావడం లేదని, అసలు ఏం జరుగుతుందో తెలియడం లేదని స్థానికులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వేసవిలో కూడా ఏ మాత్రం విద్యుత్ కోతలు లేవని, కానీ ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రోజూ ఏదో సమయంలో కరెంటు పోతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని స్థానికులు కోరుతున్నారు.



ఒరిగిన విద్యుత్ స్తంభం పడిపోకుండా పక్కనే గల చెట్టుకు కట్టిన దృశ్యం

తక్షణమే స్తంభాలు మార్చాలి

మా ఇంటి ముందు, పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగిపోయాయి. వీటిలో ఒకటి ప్రమాదకరంగా మారింది. ఈ స్తంభాన్ని వేరే వైర్లతో పక్కనే గల చెట్టుకు సపోర్టు ఇచ్చి కట్టారు. ప్రస్తుతం ఆ చెట్టు కూడా ఎండిపోయింది. పొరపాటున సపోర్టు వైరు తెగిపోయినా, చెట్టు పడిపోయినా... విద్యుత్ స్తంభం పడిపోయి పెద్ద ప్రమాదం సంభవిస్తుంది. ఈ విషయంపై అధికారులకు తెలియజేసినా స్పందించడం లేదు. వెంటనే ఇక్కడి స్తంభాలు మార్చాలి.

– ధర్మారావు, వరాహగిరికాలనీ

కరెంట్ కోతలతో ఇబ్బందులు

ఇటీవల కాలంలో విద్యుత కోతలు చాలా ఎక్కువయ్యాయి. ఎప్పడు కరెంటు పోతుందో, ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. చిన్నపిల్లలతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. గత పది రోజులలో రెండు సార్లు రాత్రంతా నిద్ర లేకుండా గడిపాం. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుకుంటున్నాం. ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలి. ప్రమాదాలు సంభవించక ముందే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– మహాలక్ష్మి, వరాహగిరికాలనీ

'వాణి గణపతి' అలంకారంలో దుర్గా గణపతి



సీతంపేటలో 'వాణి గణపతి' అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన దుర్గా గణపతి



వేలంలో దుర్గా గణపతి లడ్డూను దక్కించుకున్న సతీష్ కుమార్ ఆర్యాతో కమిటీ సభ్యులు

సీతంపేట : వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సీతంపేటలో కొలువైన దుర్గా గణపతి ఆరో రోజు గురువారం 'వాణి గణపతి' అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వీణాధారుడైన గణపతిని చూడముచ్చటగా అలంకరించారు. పరిసర ప్రాంత భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఉదయం ఆలయంలో గణపతి హోమం, స్వామి వారికి పంచామృత అభిషేకం, చందన, విభూది, ఫల రసాలతో విశేష అభిషేకం అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమం భక్తులను అలరించింది. శుక్రవారం 'విష్ణు గణపతి' అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని ఉత్సవ కమిటీ ఛైర్మన్ సారిపిల్లి గోవింద్ తెలిపారు.

దుర్గా గణపతి లడ్డూ వేలం

స్థానిక దుర్గా గణపతి నవరాత్రి మహోత్సవాలలో భాగంగా స్వామి వారికి నివేదించిన 99 కిలోల లడ్డూకు గురువారం రాత్రి వేలం పాట నిర్వహించారు. ఉత్సవ కమిటీ నిర్వహించిన వేలంలో పలువురు ఉత్సాహంగా పాల్గొని లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకోవడానికి పోటీ పడ్డారు. ఉత్కంఠగా సాగిన పోటీలో స్టీల్ సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సతీష్‌కుమార్ ఆర్యా లడ్డూను రూ.1,11,106కు దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ సారిపిల్లి గోవింద్ లడ్డూను ఆర్యాకు అందజేశారు.

ఉత్సాహంగా గణపతి అనుపోత్సవం

సీతమ్మధార : స్థానిక రైతుబజార్‌లో వినాయక చవితి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఇక్కడి రైతులు, వ్యాపారుల సహకారంతో రైతుబజార్ సిబ్బంది ఉత్సవాలు నిర్వహించారు. గురువారం గణపతి అనుపోత్సవం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కె.కోటపాడు మండలం ఆరిలీ గ్రామానికి చెందిన కళాకారుల కోలాటం ఆకట్టుకుంది. గణపతికి నివేదించిన లడ్డూను రాత్రి 7 గంటల సమయంలో వేలం వేశారు. రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్, రైతులు, వినియోగదారులు పాల్గొన్నారు.



రైతుబజారులో కోలాటం ఆడుతున్న కళాకారులు

జీవో 115 రద్దు చేయాలి



విమ్స్ ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేస్తున్న నర్సింగ్ సిబ్బంది

ఆరిలోవ: ఆస్పత్రుల్లో నర్సింగ్ సిబ్బందికి ఇబ్బందిగా మారిన జీవో నంబర్ 115ను వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని విమ్స్ నర్సింగ్ సిబ్బంది కోరారు. ఈమేరకు గురువారం విమ్స్ ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేపట్టారు. జీవో 115 రద్దుతోపాటు కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్టాఫ్ నర్స్ జయరాజు మాట్లాడుతూ నాలుగేళ్ల పాటు కష్టపడి నర్సింగ్ చదువుకుని కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వారికి ఈ జీవో వల్ల నష్టం కలుగుతుందన్నారు. 2010 నుంచి ఇంతవరకు నేరుగా స్టాఫ్ నర్సులను భర్తీ చేయలేదని చెప్పారు. ఈ పోస్టుల కోసం ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నామన్నారు. ఇప్పుడు ఏఎన్ఎంలను నేరుగా స్టాఫ్ నర్సులుగా భర్తీ చేయడం వల్ల తాము నష్టపోతున్నట్లు తెలిపారు. ఏఎన్ఎంలకు జీఎన్ఎం శిక్షణ ఇచ్చి స్టాఫ్ నర్సులుగా భర్తీ చేయడం మంచి పద్ధతి కాదని సూచించారు. కార్యక్రమంలో నర్సులు భారతి, భరత్, శాంతి, శ్రావణి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక నవరాత్రి మహోత్సవాలు

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 45వ వార్డు పరిధి నరసింహనగర్‌లో నరసింహనగర్ యూత్ కల్చరల్ స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మహోత్సవాల్లో భాగంగా ప్రతిష్టాత్మక రేడియో రెడ్ ఎఫ్ఎం 93.5 వారి నుంచి ఇక్కడ ఏర్పాటు చేసిన వినాయక మండపానికి టాప్ 9లో చోటు దక్కింది. నగరం మొత్తంలో వీరు ఎంపిక చేసిన మొత్తం తొమ్మిది మండపాలలో ఈ మండపానికి 5వ స్థానం దక్కినట్లు ఎఫ్ఎం నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా గురువారం రెడ్ ఎఫ్ఎం టీం మహోత్సవాల నిర్వాహకులకు సీఎంఆర్ ప్రతినిధి మాడా చేతుల మీదుగా 25 కేజీల లడ్డూను బహుమతిగా అందజేశారు. అనంతరం మధ్యాహ్నం నుంచి నరసింహనగర్‌లో అసోసియేషన్ సభ్యులు భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. సుమారు 5 వేల మందికి వివిధ రకాల వంటకాలతో అన్నసమారాధన నిర్వహించారు.



నరసింహనగర్‌లో నిర్వాహకులకు లడ్డూ అందిస్తున్న సీఎంఆర్, రెడ్ ఎఫ్ఎం ప్రతినిధులు



ప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

త్రిముఖ విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు గణేష్‌నగర్‌లో గల శ్రీ త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయం ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉదయం కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పి.వి.రమణమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ 11 రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తామని కమిటీ అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని, భక్తులకు నిత్యాన్నదానం కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ నెల 17న అనుపోత్సవం వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. నల్లమిల్లి వెంకటరెడ్డి, ఎంఎస్ ప్రకాశరావు, బీకే నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 51వ వార్డులో అన్నసమారాధన

మర్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డులో వినాయక చవితి సందర్భంగా పలు చోట్ల అన్నసమారాధన నిర్వహించారు. గురువారం కళింగనగర్ వుడా క్వార్టర్స్ దరి వినాయక వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, అలాగే జై భీమ్ నగర్ ఆది ఆంధ్ర సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సంతర్పణ కార్యక్రమాల్లో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొని అన్నప్రసాదం వడ్డించారు. ఆయన ముందుగా వినాయకుడిని దర్శించుకున్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న డాక్టర్ పీవీ రమణమూర్తి

అంతా బిల్డర్ల ఇష్టం

- రోడ్లపై భవన నిర్మాణ సామగ్రి డంప్
- ప్రశ్నిస్తే ఎదురుతిరుగుతున్న బిల్డర్లు
- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



గొల్లకంచరపాలెం రైల్వేట్రాక్ రహదారిలో ఇలా..



గోకుల్‌నగర్‌లో రోడ్డుకు అడ్డంగా కాంక్రీట్ పిక్కలు, ఇసుక



గౌరీనగర్‌లో ప్రమాదభరితంగా సామగ్రి

కంచరపాలెం: సామాన్యుల ఇబ్బందులతో సంబంధం లేకుండా బిల్డర్లు, కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రహదారులపై అడ్డంగా భవన నిర్మాణ సామగ్రి డంప్ చేసేసి రాకపోకలకు విఘాతం కలిగిస్తున్నారు. జీవీఎంసీ 56, 57 వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లో నిత్యం ఇదే పరిస్థితి ఉంటున్నా అధికారులు స్పందించడం లేదు. కంచరపాలెం మెయిన్‌రోడ్డు, దుర్గానగర్, వివేకానందవీధి, గొల్లకంచరపాలెం, తోటవీధి, గౌరీనగర్, గోకుల్‌నగర్, సుభాష్‌నగర్, తుమ్మదపాలెం, శ్యామ్‌నగర్, ఆశవానిపాలెం, సాకేతికపురం, తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారుల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. ఈ ప్రాంతాల్లో కొందరు భవనాలు నిర్మిస్తుండడం... వీటితోపాటు జోన్ 5 టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో మరమ్మతులు చేస్తుండడంతో అవసరసమైన ఇసుక, పిక్క వంటి సామగ్రిని తీసుకొచ్చి రోడ్ల మీద ఇష్టానుసారంగా డంప్ చేస్తున్నారు. అంతేగాక వాటికి సంబంధించిన పనులు కూడా అక్కడే చేపట్టడంతో స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇరుకు రహదారుల్లో సామగ్రి, వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే భవన నిర్మాణ యజమానులు, కాంట్రాక్టర్లు, బిల్డర్లు ఘర్షణకు దిగుతున్నారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో తాము మాట్లాడుకున్నామని, మధ్యలో మీకెందుకని ప్రశ్నిస్తున్నారు. దీంతో వారి జోలికి ఎవరూ వెళ్లడం లేదు. మరికొంత మంది అయితే ఏకంగా తమ భవనాల శిథిలాలను తీసుకొచ్చి రోడ్లమీద ఇష్టానుసారంగా పడేస్తున్నారు. పిక్క, ఇసుక వంటి వాటిని రోడ్డు పక్కన ఉన్న బోర్లు, కుళాయిల వద్ద వేస్తుండడంతో స్థానికులు తాగునీరు పట్టుకోవడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు చీకటి పడిన తర్వాత సమీపంలోని గెడ్డల్లో వ్యర్థాలు డంప్ చేస్తున్నారు. ఇటీవల రహదారిలో డంప్ చేసిన పిక్కపై అనేక మంది ద్విచక్ర వాహదారులు జారిపడిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు వార్డుల్లో ఆయా ప్రాంతాల్లో పర్యటించి తగిన చర్యలు తీసుకొని సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

జారిపడుతున్నాం

రహదారిలో ఇంటి నిర్మాణ సామగ్రి రోజులు తరబడి ఉంచడంతో ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించేటప్పుడు జారీ పడిపోతున్నాం. తీవ్ర గాయాలు పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించాలి.

– సూరి అప్పారావు, గవర కంచరపాలెం

నడవడానికి ఇబ్బందులు

రోజులు తరబడి రోడ్లపై పిక్క, ఇటుకలు, ఇసుక డంప్ చేయడంతో పాదచారులు రాకపోకలు సాగించలేకపోతున్నాం. నడవడానికి వీలులేకుండా రహదారులను ఆక్రమిస్తున్నారు. తాగునీరు పట్టుకొవడానికి వీలులేకుండా బోర్లను ఆక్రమిస్తున్నారు.

–దుర్గాభవాని, గౌరీనగర్, ఊర్వశీకూడలి

మహాధర్నాను విజయవంతం చేయండి



మహాధర్నా పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

డాబాగార్డెన్స్ : మోదీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ విధ్వంసాన్ని ఆపి సెయిల్‌లో విలీనం చేయాలని, టీడీపీ, జనసేన కూటమి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ రక్షణకు పూనుకోవాలని, ప్లాంటుకు సొంత గనులు, వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వాలని, ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడిపించాలని, ఖాళీలు భర్తీ చేయాలని, నిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలని, సకాలంలో జీతాలివ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న పాత గాజువాకలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు విజ్ఞప్తి చేశారు. మహాధర్నా పోస్టర్ గురువారం సీపీఎం జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాకు అధికారం ఇవ్వండి.. స్టీల్‌ప్లాంట్ అమ్మకం జరగదు.. ప్రభుత్వ రంగంలో మరింత బలోపేతం చేస్తాం అని పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి నాయకులు ప్రజలకు వాగ్దానం చేశారన్నారు. ప్రజలు నమ్మి భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. ఇప్పుడు ప్లాంట్‌ను అగాథంలోకి నెట్టే చర్యలను కేంద్రం చేపడుతుంటే కూటమి కేంద్రాన్ని నిలదీయకపోవడం ప్రజల ఆశలను వమ్ము చేయడమేనని ఆరోపించారు. రాజకీయంగా ఇంతటి అనుకూల పరిస్థితి గతంలో లేదు. అయినా మోదీ ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడటం కన్నా రాష్ట్ర ప్రయోజనం వీరికి ఏముందని ప్రశ్నించారు. 15వ తేదీ ఉదయం 9 గంటలకు పాత గాజువాక జంక్షన్‌లో తలపెట్టే మహాధర్నాకు ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు, నిర్వాసితులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

క్రికెట్ లీగ్ విజేత 'గుడ్‌షెపర్డ్'

విశాఖ స్పోర్ట్స్: యునైటెడ్ ఇన్‌ట్రెస్ట్ క్రిష్టియన్ క్రికెట్ లీగ్ విజేతగా గుడ్‌షెపర్డ్ లూథరన్ చర్చ్ నిలిచింది. వైఎస్సార్ స్టేడియం బీ గ్రౌండ్‌లో గురువారంతో ముగిసిన టోర్నీ ఫైనల్‌లో గుడ్‌షెపర్డ్ లూథరన్ చర్చ్ నిర్ణీత 10 ఓవర్లలో మూడు వికెట్లకు 101 పరుగులు చేసింది. ప్రతిగా ట్రూలైట్స్ చర్చ్ మూడు వికెట్లు కోల్పోయి 72 పరుగులకే పరిమితమైంది. శ్రావణ్ 62 రన్స్ చేశాడు. మూడు రోజుల పాటు జరిగిన ఈ టోర్నీలో పలు క్రైస్తవ చర్చిల జట్లు పోటీపడ్డాయి. ముగింపు కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్ విభాగపు అధ్యక్షుడు జాన్‌వెస్లీ హాజరై విజేతలకు ట్రోఫీ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపోటములు సహజమనే క్రీడాస్ఫూర్తిని అలవరుచుకోవడమే ఆటల ప్రధాన లక్షణమన్నారు. జగన్నాథరావు, నేతన్ ఐజాక్, ఎం.ప్రసాద్, సునీల్ ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసుల రెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.